

# భలే భార్యలు

- మాదిరెడ్డి సులోచన

ఆరతి ముసి ముసిగా నవ్వుకుంది.

భర్తచేసే అల్లరి పని గుర్తుకు వచ్చింది. ఆరతికి భర్తంటే ఎక్కడలేని ఆరాధన, అందగాడన్న గర్వం. నిజంగా తను అదృష్టవంతురాలు. అతనిముందు తీసికట్టే అయినా అతనలా ఎప్పుడూ అనుకోడు.

అలివేలుమంగను కాస్తా ఆరతిగా మార్చాడు.

శనివారం, బ్యాంకు మధ్యాహ్నం వరకే ఉంటుంది. కొనదలుచుకున్నవన్నీ ఆ రోజే కొంటుంది ఆరతి. ఆ రోజు లక్ష్మి, ఆరతీ కలిసి దయాల్స్‌కు వెళ్ళి మంచి ప్యాంట్లు కొనాలనుకున్నారు భర్తలకు. ఇద్దరూ వెళ్ళారు.

ముక్కు పొడుం రంగు ప్యాంట్లు చూచారు.

"మా ఆయనది మంచి రంగు లక్ష్మి! ఆయనకి ముక్కు పొడుం రంగు ప్యాంటు బాగుంటుంది. మీ ఆయన కా లైటు బ్లూ తీసుకో" అన్నది ఆరతి. లక్ష్మి చురుకుగా చూచింది.

ఆమెకీమధ్యే వివాహం అయింది. ఆమె భర్త నలుపయినా అందం, ఆకర్షణ ఉన్నవాడని

అందరూ అన్నారు. అలాంటిది ఒక తోటి ఉద్యోగిని నోటికొచ్చినట్టు అనటమా? ధిక్కారం..ధిక్కారం అనుకుంది. అప్పుడే తేలిపోవటం ఇష్టం లేదు. ప్యాంటు కొని, కాఫీ త్రాగాలని హోటల్‌కు వెళ్ళారు.

వాళ్ళ ఎదురు సీట్లో కూర్చున్న వ్యక్తులను చూచి ఇద్దరూ ఉలిక్కిపడ్డారు.

అచ్చు ఆరతి భర్త మనోహర్ లాగే ఉన్నాడొకాయన. లక్ష్మి పెదాలపై గుంభనమైన నవ్వు వెలపింది.

"ఆరతీ! ఆ యెదురుగా ఉన్నాయన చూడు__ఎర్రగా పండు కోతిలా లేడూ?" అన్నది కాఫీ ఆర్డర్ చేస్తూ.

ఆరతి ముఖం ఎర్రబారింది.

"ఆ క్లీన్ షేవ్, నలగని బట్టలు చూస్తే ఆడంగిలా అనిపిస్తున్నాడు" అన్నది.

ఆరతి విననట్టు యెటో చూచింది. మరేదో అడిగింది.

"అవునూ, జామ్ చేస్తానన్నావ్ లక్ష్మి! చేశావా?"

"పండ్లన్నీ తెచ్చాను. ఒక్కదాన్ని చేయాలంటే కష్టం. కాస్త సహాయం చెయ్యమంటే చెయ్యలేదు ఈయన. అందుకే పండ్లు తినేశాం." నిర్లక్ష్యంగా చెప్పింది లక్ష్మి.

"మా వారు ఆదివారం అన్నీ తయారుచేసి ఇచ్చారు. నేను సంవత్సరానికి సరిపడా జామ్ చేశాను." సగర్వంగా అన్నది ఆరతి. లక్ష్మి ఒంటిపై కారం రాచుకున్నట్టు అయింది.

ఆరతి చేసిన జామ్ బాటిల్స్ పటాపటామని పగలగొట్టి గిరాటు వేద్దాం అనుకుంది.

"నిజంగా అన్నింటా సహకరించే భర్త దొరికితే అంతకంటే అదృష్టం ఏముంది?" ఓ పుల్ల ఎగదోసింది సెగలోకి, ఆరతి.

లక్ష్మి ఒళ్ళు మండిపోయింది.

"ఏమదృష్టంలే! నా కయితే మగాళ్ళు అలా పనులు చేస్తుంటే కంపరంగా ఉంటుంది" అన్నది లక్ష్మి-కంపరం అంతా ముఖంలో చూపుతూ.

కాఫీ వచ్చింది.

ఆ కాఫీ కప్పు యెత్తి లక్ష్మి ముఖాన దిమ్మరించాలని ఉంది ఆరతికి. "మా ఇంటా, వంటా లేదు మగాళ్ళు పనిచేయటం. నీకే మనిపిస్తుందేమోగాని, నా కయితే అసహ్యం వేస్తుంది. మగాడంటే ఆర్డర్లువేస్తూ దర్జాగా, హుందాగా వుండాలి" అన్నది అప్పుడే

భర్తతో ఉదయం, ఆడవారి హక్కులను గూర్చి హోరా, హోరిగా పోట్లాడటం మరిచిపోయింది.

"బయటికివెళ్ళి పెళ్ళాం సంపాదిస్తే ఆనందిస్తారుగాని, ఆ పెళ్ళాం చాకిరీలో కాస్త తగ్గించాలని ఆలోచించరేం? ఇద్దరం సంపాదిస్తాం, ఇద్దరం పనిచేయాలి" అన్నది.

"ఆర్డర్.... ఆర్డర్" అంటూ భర్త నీళ్ళు నింపి, కూరలు తరిగివ్వటం మరిచిపోయింది లక్ష్మి.

కాఫీ కషాయంలా అనిపించింది ఆరతికి.

ఆమె బుర్రలో వి మా న ం ఫ్రొఫెల్లర్లు రొదపెడుతున్నాయి. కోపంగా లేచింది.

ఆరతి ఇంట్లో అడుగుపెట్టి ఆశ్చర్యపోయింది. వంటిల్లంతా శుభ్రంచేసి, కుక్కర్ ఎక్కించాడు మనోహర్.

"ఆరతీ వచ్చేశావా! నిమిషంలో తయారవ్వాలోయ్. మా ఫ్రెండ్ రాజు లేడూ! ఓ మంచి మళయాళం పిక్చర్ తెలంగాణాకి హక్కులు కొనేశాడట. సాయంత్రం షోకి మనల్ని రమ్మన్నాడు. అదేమిటి డియర్, అలా చూస్తావు? మన వాళ్ళు సెట్టింగ్స్ అని, రంగులని, హంగులని నానా హైరానా పడి దివాలా తీస్తారు" అన్నాడు కాఫీ కలపటానికి కప్పులు పెడుతూ.

మరోసారయితే ఆరతి అతని మెడకు చేతులు పెనవేసి, తీయని కబుర్లతోపాటు అంతకన్నా తీయని ముద్దులు పెట్టేది.

"ఊ!...ఆడంగి సుత్తయ్యలా వంటింట్లో ఎవరు దూరమన్నారు?" కోపంగా అరిచింది.

"రతీ! శాంతి-శాంతి! నువ్వు ఆలస్యంగా వస్తే వంటవదని వంటింట్లో దూరాను. అది నీ సామ్రాజ్యమైతే ఇప్పుడే పట్టాభిషిక్తురాలిని చేస్తాను" అన్నాడు తమాషాగా చేతులు తిప్పుతూ.

ఆమె కళ్ళు చిట్లించింది.

ఆ క్షణంలో భర్త మనోహర్‌లా కనిపించలేదు. చిల్లరకొట్టు చిట్టెమ్మలోని పువ్వుల పున్నయ్యలా కనిపించాడు.

"ఏమిటా ఆడంగి వేషాలు?" చీదరించుకుంది. తను తెచ్చిన ప్యాంటు, షర్టు గుడ్డ బల్లమీద గిరాటేసింది.

అంతకంటే హుందాగా, 'ఈ పూట వంటా పెంటా ఏం అక్కర లేదు, హోటల్‌కు వెళ్దాం అన లేడూ' అనుకుంది.

"కోపమేల బాలా!" అంటూ పాట పాడబోయాడు.

"ఏమిటా వెకిలివేషాలు?" విసుక్కుని బాత్ రూమ్‌లోకి వెళ్ళింది. మనోహర్‌కు మతిపోయింది. పెళ్ళయిన ఈ ఆరు నెలల్లో ఒక్క రోజు పోట్లాడుకోలేదు.

ఆఫీసులో ఘర్షణ పడిందా? తనంటే మొహం మొత్తిందా? మొన్న వాళ్ళింటికి వెడితే అందరూ తనను ఉంచేయమని గొడవ ప్రారంభించారు.

"మనూ! నేనుండనంటే వాళ్ళు నొచ్చుకుంటారు. నన్ను వదలి ఉండలేనని చెప్పు" అన్నది మెల్లగా.

"ఒక్క రోజు ఉండగలను" అన్నాడు అల్లరిగా మనోహర్.

"నేనుండలేను-సరా! ఒక్క నిముషం ఉండలేను" అన్నది. ఆ కళ్ళల్లోని ఆరాధనకు, ఆప్యాయతకు కరిగిపోయాడు. ఇప్పుడేమైంది?

టపీమని కాఫీ కప్పు పెట్టిన శబ్దం అయింది. ఉలిక్కిపడ్డాడు మనోహర్.

"రతీ..."

"రతీ లేదూ, సతీ లేదు." అపర సత్యభామలా వెళ్ళిపోయింది. మనోహర్ కాఫీ త్రాగినా భార్య అలకకు కారణం తెలుసుకోలేక పోయాడు.

నెమ్మదిగా ఆమెను సమీపించాడు.

"రతీ! ఏదయినా పొరపాటు జరిగితే ఇదీ అని చెప్పు-సరిదిద్దుకుంటాను. కోపాలు తాపాలంటే నాకు గిట్టవు."

"నున్నగా తయారయి, ఆడపిల్లలా తిరగటం అంటేనే గిడుతుందా?" అనిఅడగబోయి, అతని కళ్ళల్లోని ఆరాధనా భావానికి కరిగిపోయింది.

వెంటనే అనుకుంది-'ధీమాగా నిలదీసి అడగడేం' అని.

"పొరపాటు గ్రహపాటేం లేదు. నా కిష్టంలేదు ఆ సినిమా" అన్నది.

అతనికి ఈసారి కోపం వచ్చింది. బట్టలు మార్చుకోని తనే వెళ్ళిపోయాడు.

మంచి సెకండ్ పిక్చరేమో, హుషారుగా వచ్చాడు. తలుపు తీసి తల తిప్పుకుంది ఆరతి. ఈ తిరకాసు అర్థంకాలేదు.

చిరునవ్వులేదు. మధురహాసం లేదు.

మామూళ్ళు లేవు.

"రతీ!" మృదువుగా, మెత్తగా పిలిచాడు. నిజంగా రతీదేవిలా ఉంది ఆరతి.

"ఆడంగిగా, నంగిగా మాట్లాడక పోతే కాస్త గంభీరంగా మాట్లాడ లేరూ?" అన్నది కోపంగా. నున్నగా దువ్విన అతని క్రాపు బర బరా పీకేయాలని ఉంది.

ఆ మాటలు అతని అణువణు వును చీల్చాయి. ఉరకలు వేసే ఉత్సాహం చల్లారిపోయింది.

అతను వెళ్ళి బట్టలు మార్చు కుని పడుకున్నాడు. ఎంతో అందంగా గడపాలని, కొబ్బెర తిని చురుకుగా మార్చిన మళయాళీ బుర్రలను అభి నందించుకుంటూ వచ్చి అధఃపాతా ళానికి దిగజారిపోయాడు. రెండు రోజులు గడచినా పరిస్థితిలో మార్పేంలేదు. అదిలింపులు, విసి లింపులకంటే ఆరతి చూపులు భరించలేకుండా ఉన్నాడు. ఆఫీ సులో ఏమైనా చికాకులున్నాయేమో కనుక్కుందామని లక్ష్మి ఇంటికి వెళ్ళాడు మనోహర్.

లక్ష్మి భర్త మాటలు విని టక్కున ఆగిపోయాడు మనో హర్.

"పాపం! అంత మాట అన వల్సింది కాదు లక్ష్మీ! ఒకసారి వెళ్దాం పద."

"ఆ(-పెద్ద పోజు. మా ఆయన అందం అంటూ మొదలు పెడు తుంది. మా ఆయన పనులు చేస్తా డంటూ గొప్పలు చెబుతుంది. అందుకే ఆడంగి అని అవమానిం చాను. అంత మాత్రానికే మాటలు ఆపేస్తుందా?" లక్ష్మి గొంతు తీక్ష ణంగా వినిపించింది.

స్థాణువులా నిలబడ్డ మనో హర్‌కు మెల్ల మెల్లగా అంతా అర్థం అయింది. మెల్లగా ఇల్లు చేరాడు. అతను కాఫీ త్రాగుతూ ఆలోచించాడు. గంట తరువాత అతనికి కర్తవ్యం స్ఫురించింది.

"య్యా హూ!" అంటూ షమ్మీకపూర్‌లా అరిచాడు. అతను ఆరతి వచ్చే సరికి వార్తా పత్రిక పట్టుకుని కూర్చున్నాడు రెండవ రోజు. ఆరతి వచ్చి ఆశ్చర్యంగా చూచింది. అతను నీళ్ళు పట్టలేదు. అసలు నిశ్చింతగా కూర్చున్నాడు.

"ఏయ్! ఆఫీసు నుంచి ఇంత ఆలస్యంగా వచ్చావేం?"

ఆరతి ఆశ్చర్యంగా చూసింది, భర్తేనా మరెవరన్నానా అన్నారా అని. అతనే అన్నాడని అర్థం అయింది.

"కాస్త కాఫీ నా ముఖాన పొయ్యి. తరిస్తాను."

ఆరతి కళ్ళు పెద్దవయ్యాయి. తూర్పున పొద్దు పొడవ లేదన్నా

నమ్ముతుంది గాని భర్త తనను అలా మాట్లాడటమా?

"నేను అడిగింది వినిపించ లేదా? భూమికి అతుక్కుపోయా వేం?"

ఆ గద్దింపు విని కాళ్ళకు చక్రాలు వచ్చినట్టు పరుగెత్తి, కాఫీ తెచ్చింది. ఇంకొక్క నిముషం ఆలస్యం చేసినా పీక నొక్కేలా ఉన్నాడు అనుకుంది. కాఫీ తీసుకుని ముఖం చిట్లించాడు.

"పాలకంపు కొడుతుందేం?" హూంకరించినట్లే అడిగాడు.

అతనికి పాలిష్టం అని కాపిన్ని యెప్పటిలా యెక్కువ పోసింది. అంతగా అవమానించాలా?

కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

లోపలికి వెళ్ళిపోయింది. అతను కాఫీ త్రాగి బయటికి వెళ్ళి తొమ్మిది గంటలకు వచ్చాడు.

"అప్పుడే నిద్ర మొహమా! పడుకోక పోయావా?" అన్నాడు విసుగ్గా. ఆమెకు అభిమానం ముంచుకు వచ్చింది. యెప్పుడయినా ఇలా అన్నాడా? తన ఆఫీసులో ఏవో ప్రోగ్రామ్స్ ఉన్నాయని ఆలస్యం చేసిన రోజు తనను యెంత అలరించాడు? తను భోజనము చెయ్యలేదని తెలిసి, తన కోసం రెండవసారి పెరుగన్నం తిన్న భర్తేనా?

"ఊఁ అంటే ముఖం ప్రేళ్ళాడేసుకుని చూస్తావ్!" అతను కసిరే సరికి కన్నీటితో కదిలింది.

అతనికి మాత్రమే వడ్డించి తను గ్లాసుడు మంచి నీళ్ళు త్రాగింది. ఆదేం అని అడగలేద తను.

ఆకలి బాధకన్నా అవమానం బాధ యెక్కువయింది.

ఆ రాత్రి అతను చాలా మొరటుగా ప్రవర్తించాడు. ఆరతికి భర్త అసలు స్వరూపం అర్థం అయింది. మర్నాటినుండి ఒక్క సహాయం అందలేదు. పైగా అరుపులు.

సహనము సన్నగిల్లింది.

మూడో రోజు ప్యాంటు తీసి పెట్టలేదని అరుస్తుంటే రోషం ముంచుకు వచ్చింది.

"నేను ఉద్యోగం చేస్తున్నాను. మీ పనులు, బయటి పనులు చెయ్య లేను" అన్నది కచ్చితంగా.

"అయితే ఉద్యోగం మానెయ్యి..." అన్నాడు తీవ్రంగా- కొత్తగా పెంచుతున్న మీసాల షేప్ చూస్తూ.

"ఉద్యోగం చేస్తుండగానే ఇంతమాత్రం ఆదరిస్తున్నావ్. అది

లేవినాడు నా ముఖం చూడవు..."

"ఓహో! ఉద్యోగంతోనే నీ ముఖం అందంగా ఉందా?" వెటకారం చేశాడు.

వారం రోజుల్లో బాగా నీరసపడిపోయింది. అన్నం సరిగ్గా దిగటం లేదు. భర్త ఆప్యాయత, ఆదరణ లేదు. పని యెక్కువయింది. ఒక్కొక్క మధుర ఘట్టం తలచుకుని కుమిలిపోతుంది ఆరతి. ఆ రోజు ఉదయం భర్తతో ఘర్షణపడి భోజనం చెయ్యకుండా బ్యాంకుకు వెళ్ళింది. అక్కడ కళ్ళు తిరిగి పడిపోయింది.

లక్ష్మి కంగారుగా ఆటోరిక్షాలో యింటికి తెచ్చింది. మనోహర్ ఆఫీసుకు ఫోన్ చేసింది ప్రక్కింటి నుండి.

"వద్దు లక్ష్మీ! ఫోన్ చెయ్యొద్దు. ఆయన మారిపోయారు, రారు" అన్నది ఏడుస్తూ.

"పిచ్చిగా మాట్లాడకు. మనోహర్‌గారి హృదయము రూపం లాగే అందమయింది" అన్నది లక్ష్మి.

ఆరతి తన నీరసం మరిచిపోయి, చిత్రంగా చూచింది-'ఇది నిజమా' అన్నట్టు. 'లక్ష్మి నాలుకకు నరంలేదు' అనుకుంది పదేపదే.

మనోహర్ డాక్టర్‌ను వెంటబెట్టుకుని వచ్చాడు. డాక్టరు పరీక్ష చేసి, ఆమెను కొన్ని ప్రశ్నలడిగి నవ్వాడు.

"నేను అక్కడే చెప్పాను. నా అనుమానమే నిజం అయింది. మీ ఆవిడకి మూడో నెల. ఇదిగో ఈ మందులు తీసుకురా." చీటి ఇచ్చి అతను వెళ్ళిపోయాడు. అతన్ని సాగనంపి వచ్చేసరికి లక్ష్మి తలుపుకు అడ్డం నిలబడింది.

"ఏమిటమ్మా ఇది?"

"పార్టీ ఇస్తేనే ఇంట్లోకి రానిచ్చేది" అన్నది అల్లరిగా.

"జంటగా వస్తేనే పార్టీ."

"ప్రామిస్...." అన్నది నవ్వుతూ.

"డబుల్ ప్రామిస్" అన్నాడు.

"అయితే అయిదు గంటలకల్లా రెడీగా వచ్చేస్తాం" అన్నది లక్ష్మి సంబరంగా, సంతోషంగా.

లక్ష్మిని సాగనంపి ఇంట్లోకి వచ్చాడు. భర్త దగ్గరకు వస్తుంటే ఏమేమో ఊహించుకుని భయపడింది ఆరతి. ఆమె ఊహించని విధంగా మెడ క్రిందా, కాళ్ళదగ్గరా చేతులు వేసి లేవనెత్తాడు. ఆమెను గిర గిర తిప్పి, ముఖం అంతా మృదువుగా చుంబించాడు.

"రతీ...."

ఆ పిలుపుకు కరిగిపోయింది ఆరతి. జవాబుగా వెక్కి వెక్కి ఏడ్చింది. ఉధృతంగా వచ్చిన దుఃఖాన్ని ఆపుకోలేక పోయింది.

"రతీ....ఏయ్ ఇటు చూడు, నిజంగా సీపై అరిచాననుకున్నావా?" అతని మృదుత్వం చూచాక ఆమెకు ధైర్యం వచ్చింది. ఆమెకు తన ప్రవర్తన గుర్తుకు వచ్చింది.

అతనామె కళ్ళు ఒత్తాడు.

"నేను అడగంగి అన్నానని కదూ అలా ఏడ్పించారు...." అన్నది వెక్కిళ్ళమధ్య నవ్వుతూ.

"ఊం. యెవరో ఏమో అంటే అలా ఏడిపించి పారేస్తావా?"

"సారీ మనూ....అనకూడదేమో. సారీనండి!" అన్నది నిశ్చింతగా.

"అలా సారీ చెబితే చెల్లదమ్మాయ్..."

ఇద్దరూ తన్మయావస్థలో ఉండిపోయారు. అది మధ్యాహ్నమని ఆఫీసునవిలి వచ్చానని మరిచిపోయాడు.

వాళ్ళ కళ్ళకు అంతా మిధ్య, తమిద్దరే సత్యం అన్నట్టుగా ఉంది. తలుపు బాదిన చప్పుడు విని, తమ స్వర్గంనుండి బయటపడి తలుపు తీశాడు మనోహర్.

"మీరింకా రెడీ కాలేదా?" లక్ష్మి ఆశ్చర్యంగా అడిగింది.

"ఓ! సారీ లక్ష్మి! అయిదు నిమిషాల్లో వెడదాం. రండి రావు గారూ!" కంగారుగా ఆహ్వానించాడు లక్ష్మి భర్తను.

ఆరతి గదిలో తయారవుతోంది.

మనోహర్ బూట్లు వేసుకుంటూ గదిలోనుండి వచ్చే కిలకిలలు విన్నాడు.

"అబ్బా లక్ష్మీ....ఆయనలా పిలుస్తుంటే...." దాదాపు తనకు భర్తకు జరిగిన శృంగార ఘట్టం వర్ణిస్తుంది ఆరతి. ఇంకా అంతా చెప్పించుకోవాలన్న కుతూహలంతో 'అలానా' 'ఆఁ....' అంటూ మైమరచి పోయింది లక్ష్మి. ఒళ్లు మండిపోయింది మనోహర్‌కు. యెదురుగా రావుగారున్నారని మరిచిపోయాడు.

"ఛ....ఛ....ఏం భార్యలు!" అన్నాడు కోపంగా.

"భలే భార్యలు..." నవ్వాడు రావ్, అంతా అర్థం అయినట్టు.

"పదండి....పదండి! ఆలస్యం అయింది. ఆడవాళ్ళకంటే ఎక్కువ అలంకారాలు" అంటూ వచ్చింది ఆరతి.

నల్గురూ బయలుదేరారు- ఉత్సాహానికి మారు పేరుగా, ఉడుకు రక్తానికి నిర్వచనంగా. *